క్లుప్తంగా

హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

నంద్యాల(న్యూటౌన్): ఎస్‌జీటీలకు ప్రైమరీ స్కూళ్ల హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారావు డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఎస్‌జీటీలకు మిగులు పోస్టులు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. అలాగే అంతర్ జిల్లాల బదిలీలు జరపాలన్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు రామపక్కీర్‌రెడ్డి, విజయరావు, చాంద్‌బాషా, భాస్కరరెడ్డి, గోపాల్‌రెడ్డి, సుమయూన్, ప్రేమ్‌కుమార్, దస్తగిరి పాల్గొన్నారు.

వెన్నుపోటు దినానికి వలంటీర్ల మద్దతు



మహమ్మద్ రఫీ

ఉయ్యాలవాడ: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ బుధవారం నిర్వహించే వెన్నుపోటు నిరసన కార్యక్రమానికి వలంటీర్లు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి మండలంలోని వలంటీర్లందరూ హాజరు కావాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తూ రూ. 10 వేలు జీతం ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు.

వైఎస్సార్ నగర్‌లో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

బొమ్మలసత్రం : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మంగళవారం నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో కార్డన్ సర్చ్ నిర్వహించినట్లు తాలూక ఇన్‌స్పెక్టర్ ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక పోలీసులు, క్యూఆర్టీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి రౌడీ షీటర్లు, నేర చరిత్రగలవారు, అనుమానిత ఇళ్లలో సోదాలు చేశామన్నారు. సరైన పత్రాలు లేని 5 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం అక్కడ స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించి వారికి సైబర్ నేరాలు తదితర విషయాలపట్ల అవగాహన కల్పించామన్నారు. అలాగే సరైనపత్రాలు లేని వాహనాలు కొనటం, తాకట్టు పెట్టుకోవడం లాంటిచర్యలు చేయరాదని సూచిస్తూ గంజాయి రవాణా, విక్రయం చేస్తే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు వంశీధర్, చాంద్‌బాషా, సబ్ ఇన్‌స్పెక్టర్లు ధనమ్మ, నజీర్ పాల్గొన్నారు.

నేత్ర దానం



నేత్రాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని బొంతల వీధికి చెందిన మారెం శ్రీదేవి(45) అనే వివాహిత మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈమె కోరిక మేరకు కుటుంబసభ్యులు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఫ్రెండ్స్ సేవా సమితి అధ్యక్షుడు ఫణీంద్ర, చైర్మన్ విష్ణు గాయత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి ఐబ్యాంక్‌కు సమాచారం ఇవ్వడంతో వారు నేత్రాలను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఐబ్యాంక్‌కు పంపించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ కో ఆర్డినేటర్ కిశోర్, భ్రమరాంబా, రమేష్‌బాబు, అనిల్, సుధాకర్, సులోచన, ప్రదీప్, నాగన్న పాల్గొన్నారు.

ఆర్‌టీఈ సీట్ల కేటాయింపులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కర్నూలు (సిటీ): జిల్లాలోని అన్ని ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలు విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం నిబంధనలు పాటించాలని పలుమార్లు యాజమాన్యాలను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆర్‌టీఈ కింద దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేయడం జరిగిందని, సీట్లు పొందిన విద్యార్థులను చేర్చుకోవడంలో ఆయా ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ప్రతి రోజు ఫిర్యాదులు అందుతున్నాయని వివరించారు. ఫిర్యాదులు కొనసాగితే పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సీట్ల కేటాయింపులో జాప్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

మురిపించి..నష్ట పరిచి





ఎర్రగుడిదిన్నె సమీపంలో ట్రాక్టరుతో మినుముపంటను దున్నేస్తున్న దృశ్యం, లాలయ్యపేట వద్ద మొలకెత్తిన విత్తనం

ఖరీఫ్ సీజన్‌కు ప్రారంభంలోనే రైతులు నష్టాలు మూటగట్టుకోవాల్సి వచ్చింది. ఎప్పుడూ లేని విధంగా ఈసారి మేనెలలో అకాల వర్షాలు కురవడం దానికితోడు నైరుతి రుతు పవనాలు ముందుగానే పలకరించడంతో రైతుల్లో ఆశలు పెరిగాయి. ముందుగా పంటలు సాగు చేస్తే త్వరగా పంట చేతికి వస్తుంది, మార్కెట్‌లో మంచి ధర కూడా లభిస్తుందని ఆశించారు. అప్పుసొప్పు చేసి మినుము, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. అయితే, గత కొన్ని రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ఆయా పంటలు సరిగా మొలకెత్తలేదు. కొన్ని చోట్ల మొతకెత్తినా అరకొరగానే. దీంతో చేసేదిలేక రైతులు ఆ పంట పొలాలను దున్నేస్తున్నారు. రుద్రవరం మండలంలోనే దాదాపు 200 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగింది. ఎకరాకు రూ. 15వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడులు పెట్టి నష్టపోయినట్లు బాధిత రైతులు వాపోతున్నారు.

– రుద్రవరం

రసాయన ఎరువులు అధికంగా వాడొద్దు



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త

శిరివెళ్ల: పంట దిగుబడి కోసం రైతులు అధికంగా ఎరువుల వాడరాదని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్త బాలరాజు అన్నారు. మంగళవారం గోవింద పల్లె, చెన్నూరు రైతు సేవా కేంద్రాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందన్నారు. తెగుళ్ల నివారణకు ప్రతి రైతు విత్తన శుద్ధి చేయించుకోవాలన్నారు. మండలంలో 95 శాతం రైతులు వరి పంట సాగు చేస్తారని అందువలన ప్రభుత్వం ధ్రువీకరించిన వరి విత్తనాలనే వాడాలన్నారు. నేడు వ్యవసాయ రంగంలో అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వరి నాట్ల నుంచి కోతల వరకు యంత్రాల వాడకం పెరిగిపోతుందన్నారు. దీని వలన సమయం, పెట్టుబడి రైతులకు ఆదావుతుందన్నారు. సబ్సిడీపై మందు చల్లె డ్రోన్, స్ప్రేయర్లు, పైపులు ట్రాక్టర్లు, అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐఐఎం శాస్త్ర వేత్త డాక్టర్ శ్రీనివాస్, డీడీఏ చెన్నయ్య, జిల్లా వనరుల శాఖ ఏఓ ప్రభావతమ్మ, ఉద్యానవన శాఖ అధికారి దివ్య, ఆత్మ ఏటీఎం హరిబాబు, మండల ఏఓ సుధాకర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి



గోస్పాడులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గోస్పాడు: ఎన్నికల హామీ మేరకు నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేయాలన్నారు. అలాగే ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి ఇంత వరకు అమలు కాలేదని చెప్పారు. కాలయాపన చేస్తే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, నాయకులు సంజీవులు, హరినాథ్, జిలానీబాషా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గో ఆగ్రహ నిరసన దీక్ష



గోవధ నిషేధ చట్టం అమలు చేయాలని కోరుతూ దీక్ష చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ గో ఆగ్రహ నిరసన దీక్ష మూడవ రోజు మంగళవారం కొనసాగింది. రాష్ట్రీయ ధర్మ రక్షా దళ్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌పీ నవీన్ గౌడ్, జిల్లా గో రక్షక్ విభాగ్, జిల్లా ప్రముఖ్ రామ్‌చరణ్ మాట్లాడుతూ గో వధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. పోలీస్ అధికారులు పట్టుపడిన గోవులను గోశాలకు తరలించాలన్నారు. తర్వాత నిరసనకారులు నంద్యాల మున్సిపల్ అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శివ, ప్రతాప్, కల్యాణ్ ఆచారి, నిఖిల్, హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కర్నూలు బసవరాజు, కతం సుదర్శన్‌రెడ్డి, చల్లా రమేష్, బట్రీశెట్టి రవి, రామకృష్ణ, నాగేశ్వరరావు, పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అండగా బీమా



బాధితురాలికి బీమా చెక్కు అందజేస్తున్న ఏపీజీబీ గోస్పాడు బ్రాంచ్ మేనేజర్

దొర్నిపాడు: ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలని, దీని వల్ల కుటుంబానికి ఆర్థికంగా తోడుంటుందని గోస్పాడు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండుపాపల గ్రామంలో ఆయన ఖాతాదారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంజేజేబీవై బీమా పాలసీకి ఏడాదికి రూ.436 చెల్లిస్తే 50 ఏళ్ల లోపు వారు సాధారణ మరణం సంభవించిన రూ.2లక్షలు ఇస్తామన్నారు. అలాగే పీఎంఎస్‌బీవై బీమాకు రూ.20 చెల్లిస్తే 70 ఏళ్ల వయస్సు వారు ప్రమాదంలో మరణిస్తే రూ.2 లక్షలు బీమా వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి చెందిన మంగలి హరిబాబు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన ద్వారా రూ.2 లక్షల చెక్కును ఆయన భార్య వెంకట లక్ష్మికి అందజేశారు. అనంతరం ఆయన బ్యాంకు సేవల గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో బిజినెస్ కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడి, సిబ్బంది పాల్గొన్నారు.

వైన్‌షాపులో చోరీ చేసిన దొంగ అరెస్ట్



నిందితుడు ఆలమూర్ హసన్‌తో సీఐ, పోలీసులు

బేతంచెర్ల: వైన్ షాపులో చోరీ చేసిన దొంగను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. గత నెల 25వ తేదీ స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని రమ్య వైన్స్ షాపు వెనుక భాగంలో రేకు కత్తిరించి లోనికి వెళ్లిన నిందితుడి రూ.3.99 లక్షలు అపహరించాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సిమెంట్ నగర్ గ్రామంలోని కమ్యూనిటీ హాలు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న చాగలమర్రికి చెందిన ఆలమూర్ హసన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.3,71,570 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదించడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బంది సుబ్బరాయుడు, గురుబాబు, రాజు నాయక్‌లను సీఐ అభినందించారు.

ఐదురోజుల పాటు ఎఫ్‌డీపీ కార్యక్రమం



మొదటి రోజు శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

కర్నూలు సిటీ: భారత ప్రభుత్వం, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ సహకారంతో నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఐదు రోజుల పాటు అగ్మెంటేడ్ అండ్ వర్చువల్ రియాలిటీ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరుగుతోంది. సోమవారం మొదటి రోజున ప్రోగ్రాం కన్వీనర్లు డాక్టర్ లింగస్వామి, డాక్టర్ పుత్తా కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్మెండెట్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్) డొమైన్‌లో అధిక సామర్థ్యం కలిగిన ఫ్యాకల్టీ సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మోషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, డేటా సైన్స్ మధ్య కనెక్షన్, పరిశ్రమ స్థాయి అప్లికేషన్లతో ఏఆర్–వీఆర్ పరిచయం, పరిశ్రమ అప్లికేషన్‌కు సంబంధించి డొమైన్ ఆటోమోషన్, ఇమేజ్ ప్రాసెసింగ్ అప్లికేషన్లను నిర్వహిస్తారన్నారు. వీటితో పాటు మరిన్ని అంశాలపై సీట్, ఐఐటీల నుంచి నిపుణులు మాట్లాడారు. కార్యక్రమంలో జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, హ్యూమానిటీస్ అండ్ బేసిక్ సైన్సెస్ అధిపతి కె.వి.ఎస్.జి శాస్త్రీ, వివిధ విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులు మంజూరు

శిరివెళ్ల: మండలంలోని రాజనగరానికి ఎంపీ నిధులు మంజూరయ్యాయని పీఆర్ ఏఈ రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ. 10 లక్షలు మంజూరు కాగా వాటితో గ్రామంలో అంతర్గత సిమెంట్ రోడ్లు వేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మండల కేంద్రం మక్కా మసీదు ఏరియాలో రూ. 15 లక్షల మండల పరిషత్, జెడ్పీ నిధులతో సిమెంట్ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు.

సచివాలయాల్లో యోగా కార్యక్రమాలు

శిరివెళ్ల: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో యోగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప మంగళవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి కార్యాలయాల ప్రారంభం వరకు యోగా జరుగుతుందన్నారు. ఇప్పటికే యోగాపై మండల స్థాయిలో శిక్షణ తరగతులు జరిగాయన్నారు. పచ్చర్లలో జిల్లా స్థాయి మెగా యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిపారు.

ఉపాధికూలీకి పాము కాటు

రుద్రవరం: మండల పరిధిలోని బి.నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఓబులేసు అనే వ్యక్తి పాము కాటుకు గురయ్యాడు. మంగళవారం ఉపాధి పనులకు వెళ్లగా పాము కాటేసింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురికాగా తోటి కూలీలు చికిత్స నిమిత్తం రుద్రవరం లోని ఆసుపత్రికి తరలించారు.

రెండు రోజుల్లో పెళ్లి.. యువతి అదృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నెకు చెందిన ఓ యువతి మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన యువతి తెల్లవారుజాము నుంచి కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియలేదు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా బుధ, గురువారాల్లో ఈ యువతి వివాహం జరగాల్సి ఉంది.

స్మార్ట్ మీటర్లతో రూ.12 వేల కోట్ల భారం

కర్నూలు(సెంట్రల్): ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే ప్రజలపై రూ.12 వేల కోట్ల భారం పడుతుందని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు, సి.శేషాద్రి ఆరోపించారు. మంగళవారం కర్నూలులోని 24వ వార్డు లక్ష్మీనగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ×స్మార్టు మీటర్లు వద్దు₹ అంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అతికించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ దిగ్గజం ఆదానీ కోసమే స్మార్ట్‌మీటర్లను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ బిల్లులు పెంచబోమని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తరువాత ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం వేసిందన్నారు. ఇదే సమయంలో రూ.12 వేల కోట్ల స్మార్ట్ మీటర్ల భారం కూడా పడుతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎలా బతకాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో చందు, రాముడు, కర్రెన్న, జ్యోతి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై పునరాలోచన చేయాలి

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై పునరాలోచన చేయాలని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొత్తూరు సత్యనారాయణ గుప్తా మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి సూచించారు. గతంలో తెలుగుదేశం విపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి అధికారంలోకి రాగానే పచ్చజెండా ఊపడం తగదన్నారు. తొలి దశలో 40 లక్షల ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలపై అదనపు భారం పడుతుందని, సామాన్యులకు ఇబ్బందికరంగా మారకుండా చూడాలని కోరారు.

17 నుంచి యోగాంధ్ర వర్క్‌షాప్

కర్నూలు కల్చరల్: యోగాంధ్ర -2025 కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు రాయలసీమ విశ్వవిద్యాలయంలో నాలుగు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు వర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య వి.వెంకట బసవరావు పేర్కొన్నారు. మంగళవారం వీసీ చాంబర్‌లో వర్క్‌షాప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ×మనస్సును పదును పెట్టుకోవడం ఆత్మను బలోపేతం చేసుకోవడం – విద్యా నైపుణ్యం కోసం యోగ ఉపయోగపడుతుందన్నారు. నిత్యం యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని రాయలసీమ యూనివర్సిటీ నంద్యాల రామా అకాడమీ ఆఫ్ యోగిక్ సైన్సెస్ భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లు చెప్పారు. విద్యా విషయకంగా వ్యక్తిగత పురోభివృద్ధికి యోగా ఏ విధంగా ఉపకరిస్తుందో వర్క్‌షాప్‌లో వివరించడం జరుగుతుందన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొని శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం సెంట్రల్ లైబ్రరీ వద్ద పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్‌నాయుడ పాల్గొన్నారు.

కూటమి సర్కారును నిలదీద్దాం

● మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్ రెడ్డి



బొమ్మలసత్రం: ఎన్నికల హామీలు అమలు చేయకుండా మభ్య పెడుతున్న కూటమి సర్కారును నిలదీద్దామని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి సర్కారు ఏర్పడి ఏడాదైనా ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. అధికారం కోసం నాడు సూపర్ సిక్స్ పేరుతో పలు హామీలు ఇచ్చిందన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని తప్పించుకుంటుందని మండిపడ్డారు. చంద్రబాబు ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. దీనిపై ప్రశ్నించేందుకు నేడు వైఎస్సార్‌సీపీ చేపట్టే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 9 గంటలకు నంద్యాల పట్టణంలోని ఉదయానంద రెసిడెన్సీ నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు.

వెన్నుపోటు చంద్రబాబు నైజం

● వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య



వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు

బొమ్మలసత్రం: నమ్మినవారిని మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య విమర్శించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సమావేశంలో భాగంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరానికే ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. హామీలు అమలు చేయడం చేతకాక ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమ కేసులతో వేధిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలన్నారు. నంద్యాల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ వ్యవస్థలను నీరుగార్చడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని, ఆయన నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి తిరోగమనంలో ఉందన్నారు. ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి ప్రకటనలకే పరిమితమయిందన్నారు. ప్రజల పక్షాన నిలుస్తూ వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న వెన్నుపోటు దినంలో ప్రజలు భారీ ఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. అనంతరం వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ స్టేట్ సెక్రెటరీ శ్రీనివాసులు, విజయశేఖర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వివేకానందరెడ్డి, తిరుపతి, సుబ్బయ్య, అంబేద్కర్, శరత్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5వ తేదీన పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 200 నుంచి 250 మొక్కల చొప్పున 489 గ్రామ పంచాయతీల్లో లక్ష మొక్కలు నాటాలన్నారు. ఐదు మున్సిపాలిటీల పరిధిల్లో 30 వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి పాఠశాలు, కాలేజీలు, సంక్షేమ హాస్టళ్ల వద్ద భారీగా మొక్కలు నాటించేందుకు ఆయా డిపార్ట్‌మెంట్ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో 30 వేల మొక్కలు, అటవీ సరిహద్దు ప్రాంతాల్లో 40 వేల మొక్కలు నాటించాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా హౌసింగ్ కాలనీలలో ప్రతి ఇంటి ముందు మొక్కల పెంపకం జరిగేలా చూడాలన్నారు.

నర్సరీతో బహుళ ప్రయోజనాలు



రుద్రవరంలో నర్సరీని పరిశీలిస్తున్న అటవీ శాఖ ఉన్నతాధికారులు

రుద్రవరం: నర్సరీ నిర్వహణతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని అటవీ శాఖ నంద్యాల జిల్లా ఎఫ్‌డీపీటీ కృష్ణమూర్తి, డీడీపీటీ అనురాగ్‌మీనా అన్నారు. స్థానిక అటవీ కార్యాలయం ప్రాంగణంలోని ఫారెస్టు క్వార్టర్స్, నూతనంగా నిర్మించిన భవణాలు, నర్సరీని మంగళవారం వారు పరిశీలించి మాట్లాడారు. నర్సరీలో వివిధ జాతుల మొక్కలతో పాటు అటవీమొక్కలను పెంచాలన్నారు. సాధారణ మొక్కలు ఏపుగా పెరిగాక రైతులకు, బయలు ప్రదేశాల్లో నాటేందుకు ప్రజలకు ఇవ్వడం వల్ల పచ్చదనం పెరుగుతుందన్నారు. అటవీ , వన్యప్రాణుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. వారి వెంట సబ్ డీఎఫ్‌ఓ శ్రీనివాసరెడ్డి, రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు, వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి వేతనాల చెల్లింపులో సర్కారు విఫలం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నరసింహానాయక్

నంద్యాల(అర్బన్): వ్యవసాయ కూలీలకు ఉపాధి బిల్లులు చెల్లించడంలో సర్కారు విఫలమైందని ఏపీ వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి నరసింహనాయక్ అన్నారు. నంద్యాల మండలం పోలూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన జిల్లా నాయకులు కృష్ణ, శ్రీనివాసగౌడ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఏప్రిల్ 2వ వారం నుంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. దీనివల్ల వారికి పూట గడవడం కష్టమైందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల హామీలకు ఇప్పటి వరకు మోక్షం లేదన్నారు. సర్కారు తీరుపై త్వరలో రైతులు, ఉపాధి కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలి మృతి

బేతంచెర్ల: ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. బేతంచెర్ల మండలం గోరుమానుకొండ గ్రామానికి చెందిన మంగలి లక్ష్మీదేవి(63) కొంత కాలంగా అయాసంతో బాధపడుతోంది. ఎక్కడ చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. మనస్తాపంతో సోమవారం ఉదయం పేడ రంగు ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించింది.. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బేతంచెర్లకు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది.

వెలగని వీధి దీపాలు



ఉయ్యాలవాడలో రాత్రి పూట వెలగని వీధి దీపాలు

ఉయ్యాలవాడ : కూటమి ప్రభుత్వం ప్రారంభంలో గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయమని ఊదరగొట్టింది. ఆ పార్టీల నాయకులు అప్పట్లో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సిమెంటు రోడ్లు వేస్తున్నామని గొప్పలు చెప్పారు. అయితే ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో కనీసం వీధి దీపాలు కూడా వెలగని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో 10 రోజులగా వీధి దీపాలు వెలగక బీసీ, ఎస్సీ తదితర కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్లు పంచాయతీరాజ్ ద్వారా నిర్మించిన సిమెంట్ రోడ్లకు ఆరు నెలలు గడుస్తున్నా బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలకు గ్రామ సర్పంచ్‌లు సొంత నిధులు వ్యయం చేయాలంటే తమ పదవి కాలం ఒక్క ఏడాది మాత్రమే ఉంది, ఇప్పుడు సొంత డబ్బులు పెట్టి పనులు చేస్తే బిల్లులు వస్తాయో రావోనని భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో బయటకు వెళ్లాలంటే ఎక్కడ విష పురుగులు కాటు వేస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు. మండల కేంద్రంలోనే వీధి దీపాలు వెలగకపోతే గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. దీనిపై ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావును వివరణ కోరగా త్వరలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటామని, నిధుల సమస్య అయితే పంచాయతీల్లో నెలకొందని పేర్కొన్నారు.